క్లుప్తంగా

మంత్రి కాన్వాయ్ కిందపడిన వీధి కుక్క

భద్రాచలంఅర్బన్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాన్వాయ్ కిందపడి ఓ వీధికుక్క గాయపడింది. మంగళవారం భద్రాచలంలో పర్యటించారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్త ఇంటిలో విందులో పాల్గొని వెళ్తున్న క్రమంలో మంత్రి కాన్వాయ్‌కి అడ్డుగా ఓ వీధి కుక్క వచ్చింది. డ్రైవర్ పక్కకు తప్పించే క్రమంలో సదరు కుక్క ఎడమకాలు గుండా కాన్వాయ్ వెళ్లింది. స్థానికులు భద్రాచలం పశువైద్యశాలకు తరలించగా వైద్యుడు అందుబాటులో లేడు. ఆపై సారపాక పశువైద్యశాలకు తరలించగా.. డాక్టర్ బాలకృష్ణ ఆపరేషన్ చేసి కాలును తొలగించారు. అనంతరం కుక్కకు ఎస్పీసీఏ సభ్యుడు ఉదయ్‌కుమార్ ఇంటికి తీసుకుని వెళ్లారు. కాగా భద్రాచలం ప్రభుత్వ పశువైద్యశాలలో ఎనిమిదేళ్లుగా రెగ్యులర్ వైద్యుడు లేకపోయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.

బడిబాట కార్యక్రమం



ప్రచారం నిర్వహిస్తున్న హెచ్‌ఎం, యువత

దుమ్ముగూడెం: బడిఈడు పిల్లలందరినీ లక్ష్మీనగరం ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా లక్ష్మీనగరం గ్రామంలో ప్రభుత్వ బడిలో ఎన్‌రోల్‌మెంట్ (విద్యార్థుల సంఖ్య పెంపు) కోసం గ్రామంలో తిరిగి ఎక్కువ మొత్తంలో విద్యార్థులను నమోదు చేయించారు. బడిలో పిల్లలను చేర్పించేందుకు సహకరించిన గ్రామ యువతకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన ఎస్సై

అశ్వాపురం: అశ్వాపురం నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై మధుప్రసాద్ గురువారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

భక్తులకు అన్నదానం



అన్నదాత దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కోట వెంకటేశ్వరరావు–వసంత దంపతులు, వారి కుమారుడు వాసుదేవా, కుమార్తె లక్ష్మీదుర్గలు సాయినాథుని దర్శించుకున్నారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతుల వివాహ వార్షికోత్సవం, లక్ష్మీదుర్గకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాత వెంకటేశ్వరరావు దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త హర్తాళ్

చండ్రుగొండ: ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న హర్తాళ్‌ను జయప్రదం చేయాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ కోరారు. చండ్రుగొండలోని ఉపాధి పనులు చేసే ప్రదేశాల వద్ద గురువారం ఆయన కూలీలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అయన అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం మండల నాయకులు పెద్దిని వేణు, రాయి రాజా, దాసరి సీతారాములు, సావిత్రి, కాంతి, తిరుపతి, పుల్లమ్మ పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వారావుపేటరూరల్: కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అశ్వారావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంకా ప్రసాద్‌ను స్థానిక మాజీ ఎమ్మెల్యే, మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు గురువారం పరామర్శించారు. ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లి రోడ్డు ప్రమాదం, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ ఉన్నారు.

అంతా లీకులమయం

'తాలిపేరు ఆర్సీసీ చానల్ దుస్థితి..
- 3,100 ఎకరాలకు అందని సాగునీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

దుమ్ముగూడెం: ఆసియా ఖండంలోనే అతిపెద్ద నిర్మాణంగా పేరుగాంచిన పాతమారేడుబాకలోని ఆర్సీసీ చానల్ నేడు లీకులమయంగా మారి రైతుల పాలిట శాపంగా మారింది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులకు సాగు నీరందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఆర్సీసీ చానల్‌ను అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడంతో పాటు నిర్వహణ చేయకపోవడంతో నేడు ఆ కాలువ వృథాగా పడి ఉంది. మండలంలోని చివరి ఆయకట్టు భూములకు నీరందించే లక్ష్యంతో ఈ కాలువను 1998 ఆగస్టులో నాటి ప్రభుత్వం ప్రారంభించి నీటిని విడుదల చేసింది. కాని ఆది నుంచే అది చతికిలబడి లక్ష్యాన్ని చేరుకోలేదు.

ఆర్సీసీ చానల్ ప్రస్తుతం పూర్తి లీకులమయంగా మారింది. ఈ లీకుల ద్వారా భారీగా నీరు దిగువకు వృథాగా పోతోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకులు, అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. సమస్యలు పరిష్కారమై నీరు అందితే దుమ్ముగూడెం మండలంలో సాగునీరు అంది మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.



పాతమారేడుబాక దగ్గర నిర్మించిన ఆర్సీసీ చానల్

'నీరు'గారుతున్న లక్ష్యం

తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో ఎల్డీ–4పై నిర్మించిన ఈ ఆర్సీసీ చానల్ ఆయకట్టు చివరన ఉన్న సింగారం, గంగారం, నిమ్మలగూడెం, ఎస్ లక్ష్మీపురం, పొలూరిపేట ప్రాంతాల్లోని సుమారు 3,100 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. సింగారం –ఎస్ లక్ష్మీపురం, సింగారం– పొలూరిపేట వరకు కాల్వల ద్వారా నీరు పారాల్సి ఉంది. కాగా ప్రారంభించిన తరువాత ఒక రెండేళ్లు మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేసిన ఈ చానల్.. లీకులమయంగా మారి చివరకు 2013లో పూర్తిగా నిలిచిపోయింది. అప్పుడు తవ్విన కాల్వలు కేవలం అలంకార ప్రాయంగా మిగిలాయి. కాగా తాలిపేరు ఎడమకాల్వలో భారీగా పూడిక ఏర్పడడంతో పాటు, ఆయకట్టు పెరగడంతో ఎల్డీ–4లో ఆర్సీసీ ఛానల్ కలిసే ప్రాంతం వరకు సాగునీరు అందడం లేదు. కాలువ ఎగువన వానాకాలం పంట పూర్తయిన తరువాత మాత్రమే ఆర్సీసీ ఛానల్ వరకు సాగునీరు అందుబాటులోకి వస్తోంది.

మరమ్మతులు చేయాలి



ఆర్సీసీ చానల్‌కు మరమ్మతులు నిర్వహించి కాలువ చివరి భూములకు నీరందించాలి. వర్షాకాలంలో కూడా గుండు వారిగుంపు, రామకృష్ణాపురం, సాందెవారిగుంపు, బండారుగూడెం వరకు అరకొరగానే కాలువ ద్వారా నీరు వస్తుంది చానల్ నిర్మించినా రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదు. ఇప్పటికైనా ఈ ఆర్సీసీ చానల్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి చివరి భూములకు సాగునీరు అందించాలి.

– బొల్లి సత్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు

రోడ్డు పనుల పరిశీలన



పూసుకుంట అటవీ మార్గంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట: మండల పరిధిలోని పూసుకుంట అటవీ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం పరిశీలించారు. మండలంలోని అల్లిపెంట క్రాస్ రోడ్డు నుంచి పూసుకుంటకు వెళ్లే అటవీ మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణ నిమిత్తం మట్టి దారిని చదును చేసి, రోలింగ్ చేస్తుండగా.. ఎమ్మెల్యే జారే పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని బాధ్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, వ్యక్తిగత సహాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండలంలోని మల్కారం, పెద్ద గొల్లగూడెం, గుత్తావారిగూడెం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాలో నేడు (శుక్రవారం) అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరత్నం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్కారం సబ్ స్టేషన్‌లో నూతన 33 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, రైతులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో నేడు(శుక్రవారం) సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నారు. విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాల్లో నేపథ్యంలో గురువారం ఆలయం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. ఉదయం గణపతి పూజ చేసి మండపారాధన, అధివాసం, జలాధివాసం చేసి నూతనంగా ప్రతిష్ఠించే విగ్రహాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసి వాహనంపై గిరిజన నృత్యాలు, కొమ్ము డ్యాన్స్‌లతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. విగ్రహాల ప్రతిష్ఠ తర్వాత భక్తులకు ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు తెలిపారు.

తలసేమియాపై అవగాహన ర్యాలీ



తలసేమియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరురూరల్: పంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధి జన్యుపరంగా తల్లి నుంచి బిడ్డకు వస్తుందని, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం తలసేమియా రహిత భారతదేశం అంటూ వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న లంకా శ్రీనివాసరావు

దుమ్ముగూడెం: మండలంలో అర్హత కలిగి ఇళ్లు లేని పేదవారికే ఇందిరమ్మ పథకంలో ఇల్లు వర్తిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంక శ్రీనివాసరావు అన్నారు. గురువారం లక్ష్మీనగరం గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలనను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. మండలంలో పేదలకే ఇండ్ల పథకం వచ్చేలా అధికారులు, కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో ఒకటికి పది సార్లు సర్వే చేసి అర్హుల పేర్లను జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. మరి కొద్ది రోజుల్లోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదలవుతుందని, లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ నాయకులు పిలకా వెంకటరమణారెడ్డి, మట్ట శివాజీ, జీరి సత్యనారాయణ రెడ్డి, కెల్లా శేఖర్, మాజీ సర్పంచ్ కట్టం కష్ణ, తోటమల్ల సుధాకర్, కొండపల్లి నరేంద్ర, ధర్మేంద్ర, మారయ్య, లంక రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల ఆర్థిక సాయం



హమాలీకి ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం నాయకులు

పినపాక: మండలంలోని ఈ బయ్యారం గ్రామానికి చెందిన ప్రసాద్ హమాలీగా పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమై పనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న హమాలీల సంఘం నాయకులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.26 వేల ఆర్థిక సహాయం అందజేశారు. హమాలీల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు గాయపడితే సంఘం తరపున వారికి నగదు సాయం అందజేస్తామని తెలిపారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ 'గ్రామాలకు తరలిరండి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మణుగూరురూరల్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 'పల్లెలే మా పాఠశాలలు, ప్రజలే మా గురువులు' అనే నినాదంతో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 'గ్రామాలకు తరలిరండి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాపురం, రేగులగండి, తోగ్గూడెం ప్రాంతాలను గురువారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ బృందం సందర్శించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర నాయకులు మస్తాన్, అజయ్, ప్రణయ్‌లు మాట్లాడుతూ.. నేటికీ అనేక ఆదివాసీ గ్రామాలు కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మహేష్, జిల్లా నాయకులు రాగిణి, అరుణ, కిరణ్, గాంధీ, భాను పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి



మద్దికొండ గ్రామంలో పామాయిల్ తోటను సందర్శించిన బృందం

అశ్వారావుపేటరూరల్: వరి, పత్తి పంటల సాగులో రైతులో మెళకువలను పాటించి సుస్థిరమైన దిగుబడులు సాధించి నికర ఆదాయాన్ని పొందాలని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని అనంతారం, మద్దికొండ గ్రామాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేలసారాన్ని కాపాడుకోవాలని, పంటల సాగుకు ముందు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవాలని సూచించారు. అదే విధంగా స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ ద్వారా అందించే రాయితీలు, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు, కళాశాల విద్యార్థులు కలిసి ఆయా గ్రామాల్లోని పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ ఏఓ శివరాం ప్రసాద్, శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ నీలిమా, ఏఈఓలు సతీష్, సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీ యువత క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

గుండాల: ఏజెన్సీలో యువత క్రీడల్లో రానిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం గురుకుల పాఠశాల ప్రాంగణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత చదువుల్లో, క్రీడల్లో రానించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. ఏజెన్సీ నుంచి చదువుతో పాటు, క్రీడల్లో ప్రతిభను కనబరుస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మద్యం, గంజాయి, గుట్కాలకు దూరండా ఉండాలని తెలిపారు. గుండాల, కొమరారాం, ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈ క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సై సైదా రహూఫ్, గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సురేష్, మానాల వెంకటేశ్వర్లు, తిరుక్కొవళ్లూరి వెంకటేశ్వర్లు, మానాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ కంకర తనిఖీ



కంకర నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరురూరల్: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు రవాణా కోసం నిర్మిస్తున్న రైల్వే ట్రాక్ పనుల కోసం వినియోగిస్తున్న కంకరను గురువారం బీటీపీఎస్ ఎస్ఈ(సివిల్) రాంప్రసాద్, ఆర్ఐటీఈఎస్ లిమిటెడ్ ప్రతినిధి జి.వీరాంజనేయులు తనిఖీ చేశారు. రైల్వే ట్రాక్‌కు నాసిరకం కంకర వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు వారు ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ మేరకు తనిఖీ నిర్వహించారు. కంకర నాసికరంగా ఉండడంతో ల్యాబ్ పరీక్షకు పంపించారు. ల్యాబ్ నుంచి నిర్ధారణ పరీక్ష వచ్చేంత వరకు కంకరను పనులకు వినియోగించకూడదని సదరు కాంట్రాక్టర్‌కు తెలిపారు. కాగా కంకరకు సంబంధించి నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయించుకోకుండానే సదరు కాంట్రాక్టర్ కంకరను ట్రాక్ నిర్మాణ ప్రాంతాల్లో కుప్పలుకుప్పలు పోశారు. కార్యక్రమంలో బీటీపీఎస్ ఈఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మణుగూరుటౌన్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా కేంద్రం అమలు చేస్తోందన్నారు. హక్కులను రక్షించుకునేందుకు మే 24న సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు రంగా, సదానందం, వీరన్న, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఏడీఏ కె.రవికుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వరి పంట సాగుకు ముందు రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్టె విత్తనాలను సాగు చేసుకోవాలని, తద్వారా భూసార్వం పెరుగుతుందన్నారు. రాయితీపై అందించే ఈ విత్తనాల కోసం ఏఈఓల వద్ద కూపన్లు సిద్ధంగా ఉన్నాయని, వీటిని రైతులు తీసుకొని సొసైటీ కార్యాలయాల్లో అందించి జనుము, జీలుగు, పిల్లి పెసర విత్తనాలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు ఒక ఏఈఓ క్లస్టర్ పరిధిలో 10 ఎకరాల్లో మునగ పంటను సాగు చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పంట పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని, సాగు చేసే పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రకృతి వనం.. బోర్డులకే పరిమితం

- పశువులు, పిచ్చిమొక్కలకు ఆవాసం
- మోటార్లు, కంచెలు దొంగల పాలు
- పర్యవేక్షణ కరువవడంతో ఘటనలు

మణుగూరుటౌన్: పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించి, పచ్చదనం పెంచే లక్ష్యంగా గత ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కాని వాటి నిర్వహణ, పర్యవేక్షణ క్రమక్రమంగా కరువవడంతో బీడుభూములను, చెత్తకుప్పలకు, పశువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. లక్షలు వెచ్చించి వేల సంఖ్యలో మొక్కలు నాటి ఒక్కో ప్రకృతి వనం ఏర్పాటు చేస్తే పదుల సంఖ్యలో మొక్కలు కూడా కనిపించని, పెరగని దుస్థితి నెలకొంది. అధికారులు పర్యవేక్షణ కరువవడంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, మోటార్లు, గేట్లు, పట్టణ ప్రకృతి వనాల బోర్డులు కూడా మాయం అవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

దిన దినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో మున్సిపాలిటీపై బడ్జెట్ లేమి అధికారులకు మింగుడు పడటం లేదు. ప్రధాన సమస్యగా ఉన్న చెత్త సేకరణకే సమయం, సిబ్బంది సరిపోతుండటంతో పట్టణ ప్రకృతి వనాల పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, మోటార్లు, వనంలో ఏర్పాటు చేసిన బల్లలు, గేట్లు మాయమవుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కొన్ని మొక్కలు నాటి పట్టణ ప్రకృతి వనం బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి.

కళ తప్పిన ప్రధాన రహదారి..

పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్‌లో గతంలో కోనోకార్పస్ మొక్కలు పూర్తిస్థాయిలో తొలిగించకుండా మొదలు వరకు నరికివేయడంతో అవి మళ్లీ ఎదుగుతున్నాయి. వాటిని పూర్తిగా తొలిగించకపోవడంతో పాటు వాటి స్థానంలో ఆహ్లాదాన్ని పంచే మొక్కలు నాటకపోవడంతో పట్టణ ప్రధాన రహదారి కళ తప్పింది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని స్వస్తి పలికి మండల కేంద్రంగా ఉన్న మణుగూరుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని వనాలు..

- పాత మణుగూరు నీలకంఠేశ్వరాలయం పక్కనే ఉన్న ప్రకృతి వనం చుట్టూ ఫెన్సింగ్, మొక్కలు మాయమవగా, బోరు మోటార్ చోరులపాలైందని తెలుస్తోంది.
- శేషగిరినగర్‌లోని రామాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన వనం రూపురేఖలు లేకుండా వికృతంగా మారింది. పశువులు మేసేందుకు వెళ్తున్నాయి. కేవలం పట్టణ ప్రకృతి వనం తలుపులు మాత్రమే మిగిలాయి.
- ఏరియా స్టోర్ గ్రౌండ్ వద్ద ఉన్న బృహత్ పట్టణ ప్రకృతి వనంలో మొక్కలన్నీ ఎండిపోగా, కేవలం బల్లలు, ఏర్పాటు చేసిన గేటు మాత్రమే మిగిలింది.
- కొత్తకొండాపురం శాంతినగర్ స్థానికులు పట్టణ ప్రకృతివనంలో మొక్కలన్నీ ఎండిపోవడంతో పశువులను కట్టేసుకుంటున్నారు.

మున్సిపాలిటీలోని 8–9 పట్టణ ప్రకృతివనాలది దాదాపు ఇదే పరిస్థితి. కళకళలాడాల్సిన ప్రకృతి వనాలు బీడు భూములను తలపిస్తున్నాయి.



నీలకంఠేశ్వరాలయంలో గేట్ మాత్రమే మిగిలిన పట్టణ ప్రకృతివనం



ఏరియా స్టోర్స్ గ్రౌండ్ వద్ద బృహత్ ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

నిర్వహణపై దృష్టి సారిస్తాం..

పట్టణంలో ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఫెన్సింగ్, గేట్లు వంటి సామగ్రిని కొన్ని కార్యాలయానికి తరలించాం. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– టి.ప్రసాద్, కమిషనర్